

తెలంగాణ రాష్ట్ర రిటైల్ చికెన్ షాప్స్ అసోసియేషన్ ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

## రిటైల్ చికెన్ సెంటర్ యజమానులకు మార్జిన్ పెంచాలి

### మార్జిన్ పెంచే వరకు నగరంలో చికెన్‌షాపుల బంద్ నిర్వహిస్తాం

### తెలంగాణ రాష్ట్ర రిటైల్ చికెన్ షాప్స్ అసోసియేషన్ నేతల డిమాండ్

**ధర్నాచౌక్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** రిటైల్ చికెన్ సెంటర్ యజమానులకు, పౌల్ట్రీ సంస్థలు మార్జిన్ పెంచాలని తెలంగాణ రాష్ట్ర రిటైల్ చికెన్ షాప్స్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ రాష్ట్ర రిటైల్ చికెన్ షాప్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిధిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, తెలంగాణ బీసీ పొలిటికల్ ఫ్రంట్ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్‌లు హాజరై మాట్లాడుతూ రిటైల్ చికెన్ సెంటర్స్ వ్యాపారులకు మార్జిన్ పెంచి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చికెన్ పౌల్ట్రీ సంస్థల యాజమాన్యాలు వారి లాభాలు చూసుకుని, రిటైల్ చికెన్ సెంటర్స్ వ్యాపారులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల కాలంలో రిటైల్ చికెన్ వ్యాపారులకు వచ్చే మార్జిన్ 26శాతం ఉండగా, పదిశాతానికి తగ్గించారని, దీనివల్ల రిటైల్ చికెన్ వ్యాపారులు షాపుల అద్దెలు చెల్లించలేక, వర్కర్ల జీతాలు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వందల కోట్ల లాభాలు పౌల్ట్రీ సంస్థల యాజమాన్యం తీసుకుంటూ, రిటైల్ వ్యాపారులకు మాత్రం అతి తక్కువ మార్జిన్ ఇస్తూ అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. రిటైల్ చికెన్ వ్యాపారులకు మార్జిన్ ఇవ్వని పౌల్ట్రీ కంపెనీల దౌర్జన్యాన్ని ఎండగట్టేందుకు వ్యాపారులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా పౌల్ట్రీ సంస్థల యాజమాన్యాలు స్పందించి, రిటైల్ చికెన్ సెంటర్స్ వ్యాపారులకు న్యాయం చేయాలని, లేనిపక్షం వారు చేపట్టే ఉద్యమాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. అసోసియేషన్ నేతలు జి.రాజు, వరుణ్‌యాదవ్ మాట్లాడుతూ పౌల్ట్రీ యజమానులు చేస్తున్న మోసాల పట్ల వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని న్యాయం చేయాలని, పౌల్ట్రీ కంపెనీలు రిటైల్ చికెన్ అమ్మకాలపై మార్జిన్ పెంచేవరకు నగరంలో చికెన్ షాపులు నిరవధిక బంద్ పాటిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో వందలాది మంది చికెన్ సెంటర్స్ వ్యాపారులు పాల్గొన్నారు.

## ఈగల్ పోలీసుల దాడులు..

## డ్రగ్స్ సేవిస్తూ పట్టుబడ్డ 18 మంది అరెస్టు

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** డ్రగ్స్ స్మగర్లతో పాటు వాటిని సేవించే వారి భరతం పడుతు న్న ఈగల్ పోలీసులు బుధవారం నాడు జంట నగరాలు, శివార్లలో ఏకకాలంలో జరిపిన దాడుల్లో మాదకద్రవ్యాలు సేవిస్తున్న 18 మంది పట్టుబడ్డారు. ఇందులో ఒకరిని రిమాండుకు తరలించగా మిగతా వారిని ఆయా ప్రాంతాల పోలీసులకు అప్పగించారు. పట్టుబడ్డ వారిలో మేడిపల్లిలోనే ఆరుగురు వున్నారు, దీనికి సంబంధించిన వివరాలను ఈ గల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా బుధవారం మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు వరుస దాడులు చేస్తున్న ఈగల్ పోలీసులు బుధవారం నాడు పార్కులతో పాటు ఎంపిక చేసిన మరికొన్నిచోట్ల దా డులు నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిపల్లిలో బోడుప్పల్‌కు చెందిన అక్షయ్ (27) అనే స్మగ్లర్ 15 గంజాయి ప్యాకెట్లతో దొరికిపోయాడు. ఇత న్ని పరీక్షించగా గంజాయి సేవించినట్లు తేలింది. వెంటనే అతన్ని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఇతనితో పాటు వున్న మేడిపల్లి వాసులు శశి (30), వంశీ (24), రణధీర్ (28), సంజయ్ (23), బోడుప్పల్‌కు చెందిన రాఘవేంద్ర రెడ్డి (29), జగిత్యాల్‌కు చెందిన మనోజ్ కుమార్ (29) లు గంజాయి సేవించి వుండగా పట్టుబడ్డారు. వీరిని మేడిపల్లి పోలీసులకు అప్పగించారు. వీరికి ధూల్‌పేట్ నుంచి అక్షయ్ గంజాయి సరఫరా చేస్తు న్నట్లు తేలింది. కాగా చిక్కడపల్లిలో జరిగిన దాడుల్లో అదే ప్రాంతానికి చెందిన డెలివరీ బాయ్ పిల్లి సాయికుమార్ (35), స్విగ్గి డెలివరీ బాయ్ సం జయ్ బార్గవ్ (26). హరిచరణ్ (30), బాగ్‌లింగంపల్లికి చెందిన మణిరత్నం (28)లు గంజాయి సేవిస్తూ దొరికిపోయారు. వీరిని చిక్కడపల్లి పోలీసు లకు అప్పగించారు. కాగా కుషాయిగూడ పరిధిలో ఐటిఐ విద్యార్థి నీరజ్ (18)తో పాటు మరో ఇద్దరు మైనర్లు పట్టుబడ్డారు. వీరిని కుషాయిగూడ పో లీసులకు అప్పగించారు. ఎల్‌బి నగర్ పరిధిలో హస్తినాపురం నివాసి డెలివరీ బాయ్ శివకుమార్ (24), సరూర్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మైత్రీ పవన్ (24)లు పట్టుబడగా, వనస్థలిపురంలో చింతల్‌కుంటకు చెందిన మహమ్మద్ అరాఫత్ (35) అనే ప్రైవేటు ఉద్యోగి పట్టుబడ్డాడు. బాలాపూర్‌లో సితారాం కుమార్ హేమంత్ కుమార్ (35) అనే వ్యాపారి గంజాయి సేవిస్తూ దొరికిపోయాడు. వీరిని ఆయా ప్రాంతాల పోలీసులకు అప్పగించారు.

## ఎసిబి వలలో ఎఎస్ఐ

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** లంచం తీసుకుంటున్న వ్యవహారంలో ఏసీబీకి చిక్కాడు ఏఎస్ఐ. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...రూ.15వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కినట్లు అధికారులు తెలిపారు. మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై బాలయ్య అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో చిక్కినట్లు తెలిపారు. రాజు పడ్డ ఓ కేసు విషయంలో మహిళా వేధింపుల కేసును రంగారెడ్డి జిల్లా కోర్టులో లోక్ అదాలత్ ద్వారా ముగించడానికి రూ.15 వేల లంచం ఏఎస్ఐ బాలయ్య డిమాండ్ చేశారు. తాము రాజీ అయినప్పటికీ ఏఎస్ఐ తమను డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలిపారు. దీంతో బాధితుడు పల్లపు రాంబాబు ఏసీబీ అధికారులను ఆశ్రయించి జరిగిన విషయాన్ని వివరించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

దీంతో ఏసీబీ అధికారులు ముందస్తుగా ట్రాప్ ఏర్పాటు చేసి కోర్టు ప్రాంగణంలోనే బాలయ్య లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

## కాజీపేట కేంద్రంగా నూతన రైల్వే డివిజన్ ఇవ్వాలి

### కేంద్ర మంత్రికి కెటిఆర్ లేఖను అందజేసిన బిఆర్ఎస్ ఎంపీలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్1:** తెలంగాణలోని కాజీపేట కేంద్రంగా నూతన రైల్వే డివిజన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరుతూ భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు... కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఒక సమగ్రమైన లేఖ రాశారు. ఈ లేఖను పార్టీ ఎంపీల బృందం బుధవారం కేంద్ర మంత్రికి స్వయంగా అందజేశారు. కాజీపేట డివిజన్ ఏర్పాటుకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. దక్షి ణ మధ్య రైల్వేలో జరుగుతున్న అంతర్గత పునర్వ్యవస్థీకరణ, దక్షి ణ తీర రైల్వే కార్యకలాపాల ప్రారంభం వల్ల సికింద్రాబాద్ డివిజన్‌పై పనిభారం విపరీతంగా పెరిగిందని కేటీఆర్ తన లేఖలో ఎత్తిచూపారు. తాజా గణాంకాల ప్రకారం, ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్ పరిధి 2,755 ట్రాక్ కిలోమీటర్లుగా ఉందని, రాబోయే కాలంలో వాడిరాయచూర్, విష్ణుపురం బీబీనగర్ డబ్లింగ్ పనులు పూర్తయితే, ఇది సుమారు 3,150 కిలోమీటర్లకు చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఇది భారతీయ రైల్వేల పరిపాలనా ప్రమాణాల ప్రకారం ఒక డివిజన్‌కు ఉండాల్సిన పరిమితి కంటే చాలా ఎక్కువని వివరించారు. మిగతా డివిజన్లతో పోలిస్తే సికింద్రాబాద్‌పై ఉన్న ఒత్తిడిని కేటీఆర్ వివరిస్తూ.. విజయవాడ మరియు గుంతకల్ డివిజన్లు సుమారు 2,200 ట్రాక్ కిలోమీటర్ల పరిధిని కలిగి ఉండగా, గుంటూరు డివిజన్ కేవలం 900 కిలోమీటర్ల లోపే ఉందని గుర్తుచేశారు. అనేక చోట్ల ప్రతిపాదిత కాజీపేట డివిజన్ కన్నా తక్కువ కిలోమీటర్లు ఉన్న డివిజన్లను ఏర్పాటు చేసిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. ఈ భారీ అసమతుల్యత వల్ల సికింద్రాబాద్ డివిజన్ నిర్వహణ అత్యంత సంక్లిష్టంగా మారిందని, ఇది రైళ్ల రాకపోకల సాంద్రతపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే కాజీపేట కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయడం అటు పరిపాలన సౌలభ్యం,.

## మద్యం ద్వారా రాష్ట్ర ఖజానాకు రూ.40 వేల కోట్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త** తెలంగాణ రాష్ట్ర ఖజానాకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో మద్యం అమ్మకాల ద్వారా ఏకంగా రూ. 40,209 కోట్ల ఆదాయం సమకూరింది. ఆర్థిక శాఖ వివరాల ప్రకారం 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఈ ఆదాయం రూ.20,859 కోట్లుగా ఉండగా, కేవలం ఏడు సంవత్సరాల్లోనే ఇది రెట్టింపు స్థాయికి చేరుకోవడం విశేషం. గత ఆర్థిక సంవత్సరం 2024-25లో రూ.37,487 కోట్ల ఆదాయం రాగా ఈ ఏడు దానికి అదనంగా సమకూరింది. అంటే గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది అదనంగా రూ.2,722 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి జమ అయింది. ఇది సుమారు 7 శాతం వృద్ధిని సూచిస్తోంది. ఇక 2025-26 ఆర్థిక సంవత్సరంలో లిక్కర్ అమ్మకాలు స్వల్పంగా పెరగ్గా, బీరు అమ్మకాలు మాత్రం తగ్గుముఖం పట్టాయి. 382.91 లక్షల కేసుల లిక్కర్, బీరు 387.34 లక్షల కేసుల అమ్మకాలు జరిగాయి.

# రాష్ట్ర ఖజానాకు నిధుల సవాల్

### - ఆర్థిక ప్రణాళికపై కేంద్ర ఆంక్షల ప్రభావం - సొంత ఆదాయంపైనే ఎక్కువ ఆధారం - రాష్ట్ర, కేంద్ర పన్నులు, గ్రాంటులే కీలకం

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** కొత్త 2026-27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు నిధులు పెద్ద సవాల్ కానున్నాయి. అప్పులను సమకూర్చుకునే విషయంలో ఈ ఏడాది ఎఫ్ఆర్‌బిఎంలో ఒకింత ఆంక్షలు సడలించినా, కేంద్ర ఆంక్షలు, గ్రాంట్లలో కోత వంటి వాటి ప్రభావం రాష్ట్ర ఆర్థిక ప్రణాళికపై చూపించనుంది. అసలే ఆదాయ, వ్యయాలు మధ్య వ్యత్యాసం భారీగా ఉండటంతో ఖజానా లోటుతో కొట్టుమిట్టాడుతోంది. ఇచ్చిన హామీల అమలు తప్పనిసరి కావడంతో అందుకు అవసరమైన నిధుల సమీకరణపై ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. నెలవారీ ఆదాయం మరో రూ.5 వేల కోట్లు పెరిగితే తప్ప ఆర్థిక స్థితి మెరుగు పడేలా కనిపించడం లేదు. ఆర్థిక శాఖ లెక్కల ప్రకారం తెలంగాణలో ప్రస్తుతం సగటున నెలకు రూ.18 వేల 500 కోట్ల ఆదాయం వస్తోంది. అయితే. తెచ్చిన అప్పుల కిస్తీలు, వడ్డీలు, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకే ప్రతి నెలా సగటు రూ.13 వేల కోట్లు ఖర్చవుతోంది. మిగిలిన రూ.5 వేల కోట్లతోనే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి తప్పడం లేదు. ఈ నేపథ్యంలో కొత్త బడ్జెట్ 2026-27కు సంబంధించి పన్నుల ఆదాయంపైనే సర్కార్ ఆధారపడింది. మొత్తం బడ్జెట్‌లో పన్నుల ద్వారా ఆదాయం 56 శాతం మేర వస్తుందని అంచనా వేసింది. రాష్ట్ర ఖజానాకు మొత్తం రాబడి రూ.3,24,134 కోట్లుగా బడ్జెట్ అంచనాల్లో వెల్లడించింది. ఈ మొత్తంలో స్వంత పన్ను ఆదాయాల వాటా రూ.1,48,165.75 కోట్లు కాగా, కేంద్ర పన్నులలో రాష్ట్ర వాటాగా రూ.33,181.64 కోట్లుగా అంచనా వేసింది. ఈ రెండూ కలిసి మొత్తం పన్ను ఆదాయం రూ.1,81,347.39 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక శాఖ బడ్జెట్‌లో ప్రభుత్వం పన్నుల ద్వారా రూ.1.75 లక్షల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని అంచనా కాగా రూ.1,63,490 కోట్ల మేర వచ్చాయి. 2025-26లో పన్నుల ద్వారా లక్ష్యంగా పెట్టిన రూ.1.64 లక్షల కోట్లకు చివరికి రూ.1.40 లక్షల కోట్లు మాత్రమే సాధించగలిగింది. ఈ ధోరణి 2026-27 ఆర్థిక సంవత్సరంలో కూడా కొనసాగుతుందని అంచనా వేస్తూ, కేంద్ర పన్నుల వాటాతో కలిపి మొత్తం పన్ను ఆదాయం రూ.1.81,347.39 కోట్లుగా ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. ప్రభుత్వ సగటు నెలవారీ ఖర్చు రూ.26,500 నుండి రూ.27,000 కోట్లు కాగా ఆదాయ వనరులలో పన్ను ఆదాయాలు (జీఎస్టీ, ఎక్సైజ్, ఆస్తి పన్ను, మోటారు వాహన పన్ను), పన్నుయేతర ఆదాయాలు, కేంద్ర గ్రాంట్లు ఉన్నాయి. ఇవి నెలకు దాదాపు రూ.12 వేల కోట్లు వస్తున్నాయని అంచనా. ఈ నేపథ్యంలో బడ్జెట్ ఖర్చు కంటే వచ్చే ఆదాయం సగమే కావడంతో మిగిలిన నిధులను అధిగమించేందుకు ఆదాయ వనరులకు సంబంధించి పన్నుల పెంపు, మద్యం ఆదాయంపై ఆధారపడటం, భూముల అమ్మకం వంటి పలు నిర్దిష్ట మార్గాలపై 2026-27 బడ్జెట్‌లో దృష్టిసారించింది. ఎన్నికల హామీలలో మహిళలకు నెలకు రూ.2,500, రూ.500 కి గ్యాస్ సిలిండర్, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా కింద రైతులు మరియు కౌలు రైతులకు ఎకరానికి రూ.15,000 ఉన్నాయి. ఇక 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇంటి స్థలం, ఇల్లు లేని వారికి 5 లక్షలు, యువ వికాసం, సామాజిక భద్రతా పెన్షన్, రైతు భరోసా, వరికి రూ.500 బోనస్ చెల్లించాల్సి ఉంది. అలాగే కాళేశ్వరం, పాలమూరు, సమ్మక సాగర్ తదితర ప్రాజెక్టులను కొంత వరకూ అయినా చేపట్టాల్సి ఉంటుంది. మరోపక్క పీఆర్సీతో పాటు, కొత్త ఉద్యోగుల రిక్రూట్‌మెంట్, పెండింగ్ డీఏలకు అదనపు నిధులు కావాలి. అందుకు అనుగుణంగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో నిధులను సమకూర్చు కోవడం సర్కార్‌కు కత్తి మీద సాము కానుంది.

## కురుమ యువతకు అన్ని రంగాలలో అవకాశాలు కల్పించాలి

### తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం సీనియర్ నేత దొడ్డి శ్రీనాథ్



ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం నేతలు

**ధర్నాచౌక్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** కురుమ యువతకు విద్య, ఉద్యోగం, రాజకీయ రంగాలన్నింటిలో అవకాశాలు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం సీనియర్ నేత దొడ్డి శ్రీనాథ్ డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి శ్రీనాథ్, శీలంపల్లి సురేష్‌లు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమరయ్య ఆత్మగౌరవ భవనాన్ని కురుమ సంఘం అధ్యక్షులు యెగ్గ మల్లేషం, నారాయణ విద్యా సంస్థలకు అద్దెకు ఇచ్చి, కమర్షియల్ భవనంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే దొడ్డి కొమురయ్య భవనాన్ని అద్దెకు ఇచ్చే ప్రయత్నాన్ని విరమించుకోవాలని, కురుమ కులస్థులకు ఉపయోగపడే విధంగా ఐటి హబ్‌ను ఏర్పాటుచేసి, కురుమ విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధిని పెంచే విధంగా ఈ భవనాన్ని అభివృద్ధి చేయడానికి కార్యాచరణ రూపొందించాలని వారు డిమాండ్ చేశారు. దొడ్డి కొమురయ్య ఆత్మగౌరవ భవనాన్ని కొంతమంది వ్యక్తులు సొంత ఆస్థిగా వాడుకోవాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అడికె సంతోష్ మందారం, కృష్ణ, కరికె సత్యనారాయణ, ఎర్రం సత్యనారాయణ మరియు కురుమ సంఘం నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## ఉస్మానియా యూనివర్సిటీలో ఎసిబి దాడులు

### లంచం తీసుకుంటూ ఇద్దరు ఉద్యోగులు అరెస్ట్



**తార్నాక, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** ఉస్మానియా యూనివర్సిటీ పరిపాలన భవనంలో పెన్షన్ దరఖాస్తు కోసం వచ్చిన ఓ విశ్రాంత ఉద్యోగి నుండి లంచం తీసుకుంటున్న ఇద్దరు ఉద్యోగులను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ హైదరాబాద్ డీఎస్పీ గంగసాని శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగంలో కామాటిగా పనిచేసే ఓ ఉద్యోగురాలు ఇటీవల పదవి విరమణ పొందారు. పెన్షన్ కోసం ఆమె కుమారుడితో కలిసి సంభందిత సెక్షన్‌లో దరఖాస్తు చేశాడు. కాని పెన్షన్ మంజూరు కావడంలేదు. పెన్షన్ మంజూరు కోసం తరుచు ఓ.యూ పరిపాలనా భవనానినికి తిరిగాడు. అయినా పని జరుగలేదు. దీంతో అతని ఇంటి వద్దనే ఉండే సినీయర్ అసిస్టెంట్ రమేష్ ను సంప్రదించాడు. దీంతో ఆయన సంభందిత సెక్షన్‌లో సీనియర్ అసిసెంట్‌గా పనిచేస్తున్న అరవింద్‌ను కలిపించాడు. దీంతో అతను పెన్షన్ మంజూరు ప్రక్రియను పూర్తి చేయాలంటే సీనియర్ అసిస్టెంట్ అరవింద్ రూ.15,000 లంచం డిమాండ్ చేశాడు. చివరకు రూ.13,000కు ఒప్పందం కుదిరింది. ఆ మొత్తాన్ని తన సహచరుడు రమేష్‌కు ఇవ్వాలని అరవింద్ బాధితుడికి సూచించాడు. అవినీతి డిమాండ్‌ను సహించలేక బాధితుడు గత ఐదు రోజుల క్రితం ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో, వారు పథకం ప్రకారం ఉచ్చుపన్ని బుధవారం మధ్నాహ్నం ఓ.యూ లేడీస్ హాస్టల్ బస్టాప్ వద్ద రమేష్‌ను లంచం సొమ్ము తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం విచారణలో అరవింద్ పాత్ర బయటపడడంతో ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. అధికారులు వారి వద్ద నుండి లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని, తదుపరి న్యాయపరమైన చర్యల కోసం రిమాండ్‌కు తరలించారు.

## కాంబోడియాకు భారత్ సిమ్ కార్డులు!

### శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టివేత

### ఐదుగురు అంతరాష్ట్ర

## సైబర్ నేరగాళ్ల అరెస్ట్

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) అధికారులు ఐదుగురు అంతరాష్ట్ర సైబర్ నేరగాళ్లను అరె స్టు చేశారు. వీరు కాంబోడియాలో గల సైబర్ డెన్ లో భారీ నేరాలు చేసే ముఠాకు భారత సిం కార్డులు సరఫరా చేస్తున్నట్లు తేలింది. ఇందులో ఓ కడు 198 సిం కార్డులు కాంబోడియాకు తీసుకు వెళుతుండగా శంషాబాద్ విమానాశ్రయంలో పట్టుబడ్డాడు. దీనికి సంబంధించిన వివరాలను టిజి సిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ బుధవారం మీడియాకు వెల్లడించారు. యుపికి చెందిన రిజ్వాన్ (29), నగరంలోని చాంద్రాయణగుట్టకు చెందిన స య్యద్ అష్రఫ్ అలీ (30), తలాబ్‌కట్టకు చెందిన సయ్యద్ సోహైల్ (32), జూబ్లీహిల్స్ కు చెందిన అతీక్ అహ్మద్ (24), కరీంనగర్ జిల్లా కమలాపూ ర్‌కు చెందిన నూనె అశోక్ (29)లు ఒక ముఠాగా ఏర్పడి కాంబోడియాలోని సైబర్ డెన్‌లో వుండే బడా నేరగాళ్లకు భారత్‌కు చెందిన సిం కార్డులు అ ందజేస్తున్నారు. ఈ ముఠాపై కొంతకాలంగా నిఘా వుంచగా మంగళవారం నాడు అష్రఫ్ అలీ 198 సింకార్డులతో కాంబోడియా వెళుతూ శంషాబాద్ విమానాశ్రయంలో దొరికిపోయాడు. ఇతనిపై లుకవుట్ నోటీసులు వుండడంతో అధికారులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇతన్ని విచారించ గా సోహైల్ మినహా మిగతా వారు పట్టుబడ్డారు. ఈ ముఠా 2023 నుంచి 600 పైగా సిం కార్డులు కాంబోడియాకు పంపినట్లు తేలింది.

2023 లో అష్రఫ్ అలీ దుబాయ్ వెళ్లగా అక్కడ రిజ్వాన్ పరిచయం అయ్యాడు. అనంతరం ఇద్దరు సైబర్ నేరగాళ్లుగా మారి భారత సిం కార్డులను కొని కాంబోడియాకు పంపసాగారు. వీరికి సోహైల్, అతీక్ అహ్మద్. అశోక్ సహకరించేవారు. పట్టుబడ్డ నిందితులను రిమాండుకు తరలించారు. ఈ కేసు లో పరారీలో వున్న వ్యక్తి కోసం గాలిస్తున్నారు.



ఒంటిమిట్టలో బుధవారం సీతారాముల కల్యాణం దృశ్యం



పట్టువస్త్రాలు తీసుకు వెళుతున్న ఎపి సిఎం చంద్రబాబు దంపతులు

## కల్యాణం..కమనీయం

### ఒంటిమిట్ట సీతారాముల కల్యాణం

### అయోధ్యను తలపించిన కల్యాణ వేదిక

### పట్టు వస్త్రాలు సమర్పించిన ఎపి సీఎం చంద్రబాబు

### పవిత్రమైన రోజున 'అమరావతి'కి చట్ట భద్రత

**రాజంపేట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** ఆంధ్ర అయోధ్య ఒంటిమిట్టలో పౌర్ణమి రాత్రి కళ్యాణం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం సీతారాముల కళ్యాణం ఆకాశమంత పందిరిలో,అయోధ్యను తలపించిన కళ్యాణ వేదికపై ఒంటిమిట్ట కోదండ రాముడు సీతమ్మను మురిపించారు. ఒంటిమిట్టలో జరుగుతున్న శ్రీ సీతారాముల కల్యాణం కోసం టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా త్రేతాయుగంనాటి అయోధ్యను గుర్తుకు తెచ్చేలా కల్యాణవేదికను అందంగా తీర్చిదిద్దారు. వేదిక రంగురంగుల పుష్పాలతో చూపరులకు ఆహ్లాదాన్ని పం చుతోంది. వేదికపై, ప్రాచీన ఆలయాలలోని దశావతారాల సెట్టింగు, రామా యణంలోని ఘట్టాలతో యాక్రిలిక్ పెయింటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీతారాముల కల్యాణాన్ని వీక్షి ంచేందుకు వచ్చిన భక్తులు పుష్పాల అలంకరణ చూసి ముగ్ధులయ్యారు. తెలుగుదనం ఉట్టిపడేలా చెరుకులు, టెంకాయ గెల లు, టెంకాయపూత, అరటి ఆకులు, మామిడాకులు, హెలికానియమ్స్, టార్చ్ జింజర్, నీలం ఆర్కిడ్, రెడ్ ఆంథూరియం తదితర విదేశీ జాతుల పుష్పాలతో కల్యాణవేదికను అలంకరించారు. ఇందుకోసం 5 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 50 వేల కట్ ఫ్లవర్స్ వినియోగించారు. సాయంత్రం 5.10 కి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీతారాముల కళ్యాణం కోసం విచ్చేసారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి ఒంటిమిట్ట హెలిపాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఈఓ శరత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, రాజంపేట టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు, ముఖ్యమంత్రికి పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. టిటిడి అతిధి గృహమునకు చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడు, టిటిడి బోర్డు సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం 6.20 కి సీఎం సీతారాముల దర్శనం కోసం ఆలయానికి చేరుకొన్నారు. వేదపండితులు సీఎం చంద్రబాబు, సతీమణి భువనేశ్వరికి ఆలయ మర్యాదలతో పూర్ణ కుంభ స్వాగతం పలికారు. ఆలయ రంగ మండపంలో ఆలయ అర్చక స్వాములు వేద ఆశీర్వచనం, ప్రసాదం, శ్రీరామ చిత్ర పటం అందజేశారు. శోభా యాత్ర రామనామ స్మరణతో ఆద్యంతం భక్తి పారవశ్యంతో భక్తులు పాల్గొన్నారు. కళ్యాణ వేదికపై రాత్రి 6.30 గంటలకు కళ్యాణ క్రతువుకు టిటిడి వేదపండితులు రాజేష్ బట్టర్ శ్రీకారం చుట్టారు. గణపతి పూజతో ప్రారంభమై, విశ్వక్షేణ పూజ నిర్వహించారు పుణ్యాహావచనంతో వేదికను శుద్ధి చేసేందుకు పూజ నిర్వహించారు.

## యుద్ధం దెబ్బతో ఆవిరవుతున్న సిపిఎస్ ఉద్యోగుల పెన్షన్ సొమ్ము

### - తెలంగాణ రాష్ట్ర సిపిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** ఇరాన్ - ఇజ్రాయెల్ యుద్ధం ప్రత్యక్ష ప్రభావం సిపిఎస్ ఉద్యోగుల కష్టార్జితమైన పెన్షన్ నిధులపై పడు తోందని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల పెన్షన్లపై కార్పొరేట్ పెత్తనం నశించాలన్నారు. యుద్ధం కారణంగా కొద్ది రోజులుగా స్టాక్ మార్కె ట్లు పతనమవడంతో ఉద్యోగుల పిఆర్ఎఎన్ ఖాతాల్లోని నికర ఆస్తి విలువ (ఎన్ఎవి) పడిపోయి వేలాది రూపాయల సొమ్ము ఆవిరై పోతోందన్నారు. తమ రిటైర్మెంట్ జీవితం కోసం దాచుకున్న సొమ్ము కళ్లముందే కరిగిపోతుంటే ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. సిపిఎస్ పింఛన్ విధానం ఎంత ప్రమాద కరమైనదో ప్రస్తుత పరిస్థితులు నిరూపిస్తు న్నాయని పేర్కొన్నారు. "ఎక్కడో జరుగుతున్న యుద్ధానికి, ఇక్కడ రక్తం ధారపోసి పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగి పెన్షన్ సొమ్ముకు సంబంధం ఏంటి?. మా పదవీ విరమణ జీవితాన్ని అంతర్జాతీయ మార్కెట్ జూదగాళ్ల చేతుల్లో పెట్టడం దుర్మార్గం.

సిపిఎస్ కింద ఉద్యోగి వాటా 10శాతంతోపాటు ప్రభుత్వం చెల్లిస్తున్న 10శాతం వాటా కూడా ప్రజలు చెల్లించిన పన్నుల రూపంలో వచ్చిన ప్రజా ధనమే. ఇంతటి భారీ మొత్తాన్ని కార్పొరేట్ కంపెనీల లాభనష్టాల మీద ఆధారపడేలా చేయడం ప్రజలను, ఉద్యోగులను వంచించడమే. ప్రభుత్వోద్యోగుల పెన్షన్ల పై ఈ కార్పొరేట్ పెత్తనం ఇక సాగనివ్వొద్దు." అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగి తన చమటను దారబోసి దాచుకున్న సొమ్ము అన్నారు.

## ఆర్టీసి బస్ భవన్‌లో కలకలం

### ఎ బ్లాక్‌లో ఉన్న నాలుగు అంతస్తులను ఐటీ, జీఎస్టీ అధికారుల స్వాధీనం

**చిక్కడపల్లి ఏప్రిల్ 1 ( ప్రభాతవార్త ) :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రధాన కార్యాలయమైన బస్ భవన్ వేదికగా బుధవారం జరిగిన ఈ పరిణామం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. దీనికి సంబంధించిన కొన్ని ముఖ్య అంశాలు ఇక్కడ ఉన్నాయి. బస్ భవన్‌లోని ఖీఎఖీ బ్లాక్‌లో ఉన్న నాలుగు అంతస్తులను ఐటీ (ఆదాయపు పన్ను శాఖ) , జీఎస్టీ (వస్తు సేవల పన్ను) అధికారులు తమ ఆధీనం లోకి తీసుకున్నారు. సాధారణంగా పన్ను బకాయిలు లేదా ఇతర పరిపాలనాపరమైన లావాదేవీల విచారణలో భాగంగా కేంద్ర ప్రభుత్వ విభాగాలు ఇటువంటి చర్యలు తీసుకుంటాయి. ఆర్టీసీకి సంబంధించిన రికార్డుల పరిశీలన లేదా కార్యాలయాల కేటాయింపులో భాగంగా ఈ మార్పులు జరిగి ఉండవచ్చు. ప్రధాన కార్యాలయంలోని కీలకమైన బ్లాక్‌ను అధికారులు తమ నియంత్రణలోకి తీసుకోవడం వల్ల, అక్కడ పనిచేస్తున్న ఆర్టీసీ విభాగాలను ఇతర ప్రాంతాలకు లేదా ఇతర అంతస్తులకు మార్చే అవకాశం ఉంది. ఈ పరిణామం సంస్థ యొక్క అంతర్గత పరిపాలన మరియు ప్రభుత్వ విభాగాల మధ్య ఉన్న సమన్వయానికి సంబంధించినదిగా కనిపిస్తోంది. దీనిపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

